క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం



ఏలేశ్వరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఏలేశ్వరం: పట్టణంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జగ్గంపేటకు చెందిన శ్రీచరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని సచివాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు జయరావు, ఉమామహేశ్వరి, మహేశ్వరరావు, అనిల్‌బాబు సుమారు 85 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 40 మందిని శస్త్రచికిత్సల నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. కార్యక్రమంలో పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణా తరగతులు

కిర్లంపూడి: మండల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పంచాయతీల్లో పారిశుధ్యం, చెత్త నుంచి సంపద కేంద్రాలు, వీధి దీపాల నిర్వహణ, పంచాయతీల విధులు, బాధ్యతలు, పంచాయతీరాజ్ చట్టం, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తదితర అంశాలపై ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ ఇస్తారన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు విధిగా ఈ శిక్షణకు హాజరు కావాలని కోరారు.

గండేపల్లి: మండలంలోని గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం నుంచి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ హనుమంతరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణకు హాజరయ్యే వారికి భోజన వసతి కల్పిస్తామన్నారు. సర్పంచులు, కార్యదర్శులు తప్పక హాజరు కావాలని సూచించారు.

తహసీల్దార్‌గా ప్రసాద్ బాధ్యతలు స్వీకరణ



తుని తహసీల్దార్ ప్రసాద్‌ను అభినందిస్తున్న సిబ్బంది

తుని: మండల తహసీల్దార్‌గా జీవీఎస్ ప్రసాద్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన యు.కొత్తపల్లి మండలం నుంచి ఇక్కడకు బదిలీపై తునికి వచ్చారు. తుని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఘనంగా కాశీ కావడి యాత్ర



జగ్గంపేటలో కాశీ కావడి యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: మార్వాడీలు నిర్వహించిన కాశీ కావడి యాత్రతో ప్రజలందరికీ శుభాలు జరగాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆకాంక్షించారు. రాజస్థాన్ నుంచి జగ్గంపేట వచ్చి స్థిరపడిన మార్వాడీలు ఆదివారం కాశీకావడి యాత్ర ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం జగ్గంపేట నుంచి సామర్లకోటలోని భీమేశ్వరస్వామి ఆలయం వరకూ కాశీకావడి యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. కొద్దిదూరం కావడి మోసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. మార్వాడీ పెద్దలు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన తప్పని సరి

కొత్తపల్లి: కాలానుగుణంగా వ్యాప్తి చెందే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని వైద్యాధికారిణి సౌజన్య అన్నారు. మండలంలోని నాగులపల్లి ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రలో ఆదివారం సీజనల్ వ్యాధులపై రోగులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో మార్పులు కారణంగా సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉన్నందున తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఈ కాలంలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ఫ్లూ జ్వరాలు అధికంగా వచ్చే అవకాశం ఉందని అటువంటి వారిని ఉపాధ్యాయులు గుర్తించి పాఠశాలలకు రాకుండా ఇళ్ల వద్దే విశ్రాంతి తీసుకునేలా చూడాలన్నారు. పాఠశాలకు వస్తే ఇతర విద్యార్థులకు కూడా ఈ ఫ్లూ జ్వరాలు సోకే ప్రమాదం ఉందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమీలేదు. లక్షణాలకు అనుగుణంగా చికిత్సను అందించాలన్నారు. ఈ వ్యాధికి ప్లేట్‌లెట్స్ తగ్గుతాయని తెలిపారు. డెంగీని వ్యాప్తిచేసే ఏడిస్ దోమ పగటి పూటే కుడుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అసంపూర్తిగా... అలంకార ప్రాయంగా..

- ఏళ్లతరబడి నిర్మాణం పూర్తికాని బాలికల హాస్టల్
- అదే మార్గంలో ఎంఈఓ కార్యాలయం, తుపాను షెల్టర్
- పట్టించుకోని అధికార యంత్రాంగం



కోటనందూరు హైస్కూల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన బాలికల హాస్టల్ నిర్మాణం

కోటనందూరు: జిల్లా శివారున ఉన్న కోటనందూరు మండలం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయింది. ఈ మండలంపై అధికారులకు చిన్నచూపు ఉందనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలో ప్రభుత్వ నిధులతో ప్రారంభించిన అనేక భవన నిర్మాణాలు పూర్తి కాకుండా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ భవనాలు అందుబాటులోకి రాకపోవడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. అనేక సంవత్సరాలుగా నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి నిర్మాణాలు పూర్తి చేయడంతో పాటు భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.1.94 ఆర్‌ఎంఎస్‌ఏ నిధులతో

ఆరేళ్ల క్రితం కోటనందూరు జెడ్పీ హైస్కూల్లో దూర ప్రాంతాల నుంచి వచ్చే బాలికలకు చదువుతో పాటు వసతి కల్పించేందుకు రూ.1.94 ఆర్‌ఎంఎస్‌ఏ నిధులతో హాస్టల్ నిర్మాణాన్ని ప్రారంభించారు. ప్రారంభ సమయంలో రెండేళ్లకే పనులు పూర్తి చేస్తామని అధికారులు చెప్పినప్పటికీ ఆ దిశగా నిర్మాణం పూర్తి కాలేదు. శ్లాబ్ లెవెల్ వరకూ వేగంగా పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ తుది పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. దీంతో అనేక గ్రామాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థినులకు అవస్థలు తప్పడం లేదు. ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠశాల జూనియర్ కళాశాలగా మారడంతో సమస్య మరింత జటిలమైంది.

కోటనందూరు ఎంఈఓ కార్యాలయ నిర్మాణం కోసం 2007 సంవత్సరంలో రూ.7 లక్షలు కేటాయించారు. ప్రభుత్వం కేటాయించిన నిధులతో 2013 నాటికి గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మొదటి అంతస్తు శ్లాబ్ లెవెల్ వరకూ పూర్తయింది. నిధుల కొరతతో మిగిలిన పనులు నిలిచిపోయాయి. దీంతో సభలు, సమావేశాల నిర్వహణకు ప్రత్యేక భవనం లేక విద్యాశాఖ అధికారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యాశాఖ అధ్వర్యంలో జరిగే అన్ని కార్యకలాపాలు, కార్యాలయ నిర్వహణ రెండు గదులున్న చిన్న భవనంలోనే నిర్వహిస్తున్నారు. మండలంలోని జగన్నాథపురంలో 10 ఏళ్ల క్రితం తుపాను పునరావాస కేంద్ర నిర్మాణం ప్రారంభించారు. నిధుల కొరతతో నిర్మాణం పూర్తి కాలేదు. రూ.లక్షలు ఖర్చు చేసినా ప్రజావసరాలు తీరడం లేదు. మరికొద్ది నిధులు ఖర్చు చేసి ఈ తుపాను షెల్టర్‌ను అందుబాటులోకి తీసుకొస్తే లోతట్టు ప్రాంతంలో నివసించే గ్రామస్తులకు తుపాను, వరదల సమయంలో ఎంతో మేలు జరుగుతుంది.



జగన్నాథపురంలో నిరుపయోగంగా దర్శనమిస్తున్న తుపాను షెల్టర్

విద్యార్థినులకు ఎంతో ఉపయోగం



అనేక సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉన్న హాస్టల్ నిర్మాణం పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకొస్తే విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. హాస్టల్ అందుబాటులోకి వస్తే పరిసర ప్రాంతాల పేద విద్యార్థినుల విద్యాభివృద్ధికి తోడ్పడుతుంది. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

అయిల వీరబాబు, కోటనందూరు

నిర్మాణం పూర్తి చేయాలి



తుపాను షెల్టర్ పనులు పదేళ్ల క్రితం ప్రారంభించారు. నిధుల కొరతతో నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. కొద్దిపాటి నిధులు ఖర్చు చేస్తే నిర్మాణం పూర్తవుతుంది. సంబంధిత అధికారులు స్పందించి తుపాను షెల్టర్ నిర్మాణం పూర్తి చేయాలి.

భీమిరెడ్డి నాగబాబు, జగన్నాథపురం

కత్తిపూడిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



కత్తిపూడిలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కొత్తపల్లి: సారా విక్రయిస్తుండగా ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొత్తమూలపేటకు చెందిన గుబ్బం హరిబాబు సారా విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడిచేసి హరిబాబును అరెస్టు చేసి తన వద్ద నుంచి 20లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రుల చెంతకు..



గణపతిని అతని తండ్రి, బంధువులకు అప్పగిస్తున్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ సాయి త్రినాథ్

అన్నవరం: రెస్టారెంట్‌లో పని చేయమని తల్లిదండ్రులు కోరగా అందుకు ఇష్టపడని యువకుడు ఇంటి నుంచి పారిపోయాడు. అన్నవరం రైల్వేస్టేషన్‌లో ఆదివారం అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో రైల్వే పోలీసులు అతడికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. స్థానిక రైల్వే హెడ్ కానిస్టేబుల్ సాయి త్రినాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలికి చెందిన యువకుడు గణపతిని అతని తల్లిదండ్రులు వారి ఇంటికి సమీపంలో గల రెస్టారెంట్‌లో పనిచేయమన్నారు. అందుకు ఇష్టపడని గణపతి నగదు, బ్యాగ్‌తో ఇంటి నుంచి పారిపోయి వచ్చి అన్నవరం రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో రైల్వే పోలీసులు అతడిని విచారించారు. తాను ఇంటి నుంచి పారిపోయి వచ్చినట్టు యువకుడు తెలిపాడు. దీంతో తుని రైల్వే ఎస్‌ఐ అబ్దుల్ మారుఫ్ ఆదేశాల మేరకు అతని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చాక గణపతి, అతని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించినట్లు ఆయన తెలిపారు.

దళితులపై దాడులను ఖండించాలి

పిఠాపురం: స్థానిక మాల మహానాడు కార్యాలయంలో ఆదివారం 26వ మాల మృతి వీరుల సంస్మరణ సభ జిల్లా అధ్యక్షుడు దారా వెంకటరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పీవీ రావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాల మహనాడు రాష్ట్ర అధ్యక్షుడు గుబ్బల రాజు మాట్లాడుతూ గతంలో పీవీ రావు పిలుపు మేరకు చలో అసెంబ్లీ ప్రకటించగానే రాష్ట్రం నలుమూలల నుంచి లక్షల మంది మాలలు ఉద్యమంలో పాల్గొని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. ఆ కార్యక్రమాన్ని అడ్డుకోవడం కోసం, ఆనాటి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆందోళనకారులను గుర్రాలతో తొక్కించి, బాష్పవాయువు ప్రయోగించి, లాఠీలతో దాడి చేయించి, తుపాకీలతో కాల్పులు జరిపారన్నారు. ఆ ఘటనలో తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురానికి చెందిన పాణంగి శేషయ్య, ఒంగోలు పట్టణం ఓవుతోట నారాయణ ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1న సుప్రీంకోర్టు చెప్పిన తీర్పు ప్రకారం వెనుకబాటు ప్రాతిపదికన ఎస్సీ వర్గీకరణ చేయడానికి రాష్ట్రాలకు అధికారం ఇవ్వడం, క్రిమిలేయర్ అమలు చేయడాన్ని మాల మహానాడు పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో దళితులపై జరుగుతున్నా దాడులను ఖండించడం లేదని, బాధ్యులపై చర్యలు తీసుకోవడంలేదన్నారు. విజయవాడలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ స్మృతి వనంలోకి ప్రవేశించి శిలాఫలకం ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో యాండ్ల లక్ష్మీపతి, ములగపాటి బుచ్చిరాజు, దడాల సత్తిబాబు, దుర్గాడ సింహాచలం బందిలి సూరిబాబు, దడాల చిన్నబాబు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కిర్లంపూడిలో 47 ఏళ్ల తరువాత కలసిన పూర్వ విద్యార్థులు

కిర్లంపూడి: స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలకు చెందిన 1976–77 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 47 ఏళ్ల తర్వాత స్థానిక వాసవీ కనకా పరమేశ్వరి కల్యాణ వేదిక వద్ద కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని గుండెలకు హత్తుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలకు వెళ్లి తరగతి గదుల్లో కలయతిరిగారు. నాడు చేసిన అల్లర్లు, చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సీతాల శ్రీధర్‌శాస్త్రి, ద్విభాష్యం గోపి, ద్విభాష్యం కోటి, బుర్రె రామారావులను సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడిగా గడిపారు. పూర్వ విద్యార్థులు ఉసిరిగల నందిబాబు, శరకణం శివశంకర్, కంట పెద్దకాపు, గుడాల వెంకటరత్నం, పువ్వుల సుబ్రహ్మణ్యం, కర్రి వెంకట రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రహదారుల చెంతనే వ్యర్థాలు



దిబ్బలపాలెంలో రహదారిపై పేరుకుపోయిన వ్యర్థాలు



మందుల కాలనీ సమీపంలో శ్మశానవాటిక వద్ద రహదారి చెంతనే వేసిన చెత్త

ఏలేశ్వరం: పట్టణంలోని రహదారులపై ఎక్కడికక్కడే చెత్త పేరుకుపోయింది. దీంతో పాటు రహదారులను ఆనుకుని మొక్కలు పెరిగిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పట్టణంలోని దిబ్బపాలెం, తోటవీధి, సువ్వయ్యమ్మపేట, సాయినగర్ తదితర ప్రాంతాల్లో రహదారులపై చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం పట్టణంలో వైరల్ జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జ్వరాలతో అవస్థలు పడుతున్న ప్రజలకు పందులు, కుక్కల సంచారం సమస్యగా మారింది. పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మరిడమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



భక్తుల నుంచి పూజలందుకుంటున్న మరిడమ్మ

పెద్దాపురం: ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే మరిడమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా శ్రావణ మాసం మొదటి ఆదివారం సైతం మరిడమ్మను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు భారీ క్యూ కట్టారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్.రామ్మోహనరావు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు చేపట్టారు. జాతర మహోత్సవం తాత్కాలిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీఎస్పీ లతాకు మారి ఆదేశాల మేరకు సీఐ టి.క్రాంతికుమార్ పర్యవేక్షణలో ఎస్సై మౌనిక ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు.

ఆహారం.. విషతుల్యం

- దాబాల్లో ఫాస్ట్‌ఫుడ్ తింటే రోగాలు
- నిల్వమాంసం, నిషేధిత రసాయనాల వినియోగం
- ప్రజల ఆరోగ్యానికి తప్పని ముప్పు
- తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు



బెండపూడి శివారు దాబాల్లో తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు (ఫైల్)

తొండంగి: మారుతున్న కాలానికి అనుగుణంగా ఫాస్ట్ ఫుడ్స్‌కు అలవాటు పడిన ప్రజలు తరచూ వాటిని తిని దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. ఇటీవల కాలంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు మరింత పెరిగాయి. ఫ్రీజర్లలో వండిన ఆహారం నిల్వ ఉండడంతో పాటు అపరిశుభ్రమైన పాత్రల్లో మాంసం రోజుల తరబడి నిల్వ ఉంచడం వంటి పరిణామాల నేపథ్యంలో దాబాల్లో ఫాస్ట్‌ఫుడ్ తిని ప్రజలు తమ ఆరోగ్యాలను గుల్ల చేసుకుంటున్నారు. నిషేధిత రసాయనాలు వినియోగిస్తూ తయారు చేసిన ఫాస్ట్‌ఫుడ్ పట్ల అప్రమత్తంగా లేకుంటే దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడటం తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

టేస్టింగ్ సాల్ట్, నిషేధిత రంగుల వినియోగం

ఆదాయార్జనే ధ్యేయంగా దాబాలు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో యజమానులు ప్రజారోగ్యాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. చికెన్ బిర్యానీ, ఫ్రైడ్ రైస్, జాయింట్ ఫ్రై ఇతర ఫాస్ట్‌ఫుడ్ తయారీలో టేస్టింగ్ సాల్ట్ , కలర్స్ కలర్‌ఫుల్‌గా కనిపించేందుకు నిషేధిత హానికర రంగులు అధిక మోతాదులో వినియోగిస్తున్నారు. ఇవి తిని ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.



దాబాల్లో ఫుడ్ శాంపిల్స్ సేకరించిన అధికారులు

జాతీయ రహదారిని ఆనుకుని...

సిటీ కల్చర్ పల్లెలకు కూడా పాకడంతో గ్రామీణ ప్రాంతాల్లోనూ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు విచ్చల విడిగా పెరిగిపోయాయి. ఇటీవల బెండపూడి శివారులో జాతీయ రహదారిపైనా, అన్నవరం వెళ్లే రహదారిలో దాబాలు పదుల సంఖ్యలో వెలశాయి. దాబాల్లో కాకినాడ ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు బయటపడ్డాయి. పలు దాబాల్లో తనిఖీలు చేసిన అధికారులు అపరిశుభ్రంగా ఉన్న ఫ్రీజర్లలో మాంసం, పన్నీరు, మష్రూమ్స్ వంటి పదార్థాలు నిల్వ ఉంచడంతో పాటు బిర్యానీలో మిగిలిన జాయింట్, ఇతర మాంసం ముక్కలను నిల్వ ఉంచడాన్ని అధికారులు గుర్తించారు. అలాగే నిషేధిత రంగులు వేసి వండిన చికెన్ ఫ్రై ముక్కలను కూడా ఫ్రీజర్‌లో నిల్వ ఉంచారు. వంటకాల్లో టేస్టింగ్ సాల్ట్, ప్రమాణాలు లేని వంటనూనె వినియోగం, నిషేధిత రంగులు వినియోగించడాన్ని గుర్తించి వాటి శాంపిల్స్‌ను సేకరించారు. సంబంధిత దాబాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వం నిషేధించిన రసాయన పదార్థాలను వినియోగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కాకినాడ ఫుడ్ సేఫ్టీ అధికారి కొత్త వెంకటసుబ్బారావు హెచ్చరించారు.

ఆరోగ్యంపై దుష్ప్రభావాలు

ఫాస్ట్‌ఫుడ్ తయారీలో వినియోగించే టేస్టింగ్ సాల్ట్, నిషేధిత రంగులు ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావాలు చూపుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా కేంద్ర నాడీ వ్యవస్థ దెబ్బతినడం, జ్ఞాపకశక్తి లోపించడం, అల్జీమర్స్, పార్కిన్సన్, నిద్రలేమి, అరచేతులు, అరికాళ్లలో తిమ్మిర్లు, మైగ్రేన్ తలనొప్పి, వికారం, నీరసం, వంటి అనారోగ్య సమస్యలతో పాటు బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని చెబుతున్నారు.

నిల్వ చేసిన ఆహారం తినొద్దు



నిల్వ ఉంచిన మాంసం, నిల్వ ఉంచిన ఆహారం ఆరోగ్యంపై దుష్ప్రభావాలు చూపుతాయి. ఫాస్ట్‌ఫుడ్స్ సాధ్యమైనంత వరకూ తినకపోవడం మంచిది. వ్యాయామం , సరైన ఆహారపు అలవాట్లతో మన ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు కాపాడుకోవాలి. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం కావడంతో మరింత జాగ్రత్తగా వహించాలి.

– డాక్టర్, కె.అర్చన, వైద్యురాలు, రావికంపాడు పీహెచ్‌సీ.



ఫ్రీజర్‌లో నిల్వ ఉంచిన మాంసం

వైభవంగా పైడితల్లి అమ్మవారి పండగ



పెద్దిపాలెంలో పైడితల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెంలో పైడితల్లి అమ్మవారి పండగ ఆదివారం వైభవంగా జరిగింది. అమ్మవారి పండగను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు రీసు సత్యనారాయణ, రాళ్ల సీతారాం, రీసు నాగరాజు, కండిపల్లి రాజు, పితాని పెద్దచంటి, బొందలపు రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను అరికట్టాలి

సామర్లకోట: పట్టణ పరిధిలో బీజేపీ నాయకులు ఆదివారం రాత్రి కాగడాల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక పోలీసు రింగ్ సెంటర్ నుంచి రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్, మఠం సెంటర్, మెహర్ కాంప్లెక్స్ వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బంగ్లాదేశ్ దాడుల్లో మరణించిన హిందువుల ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.